క్లుప్తంగా

గుడుంబా పట్టివేత

మహబూబాబాద్ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో విస్తృత తనిఖీలు చేస్తున్నామని రూరల్ ఎస్సై బి.రాంచరణ్ అన్నారు. ఇందులో భాగంగా గడ్డిగుడెం తండా గ్రామ శివారులో నిల్వ ఉంచిన బెల్లం పానకంను ధ్వంసం చేశామన్నారు. అదేవిధంగా 35 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని తెలిపారు. తనిఖీల్లో రూరల్ రెండో ఎస్సై కుమారస్వామి, ఏఎస్సై పెద్దిరెడ్డి రమేష్, పీసీ బాలరాజు పాల్గొన్నారు.

దంతాలపల్లిలో..

దంతాలపల్లి: మండల కేంద్రంలో శనివారం రూ.2వేల విలువ గల మద్యం 10లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొడ్లాడ గ్రామంలో బెల్టు, గుడుంబా షాపులపై తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఓ ఇంట్లో మద్యం, గుడుంబా పట్టుబడగా వాటిని స్వాధీనం చేసుకొని షాపు నిర్వాకురాలు యాకమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

గార్లలో..

గార్ల: మండలం లోని పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన భూక్యా లావణ్య గుడుంబా విక్రయిస్తుండగా పోలీసులు దాడిచేసి కాపుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న శనివారం తెలిపారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ శ్యామ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: ఎన్నికల నిబంధనలు అతిక్రమించారని ఎఫ్‌ఎస్‌టీ టీం బాధ్యులు అఫ్సర్ పాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీజేపీ నేతలపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని మహబూబాబాద్ టౌన్ ఎస్సై వి.దీపికరెడ్డి శనివారం తెలిపారు.

మున్సిపల్ చైర్మన్‌పై..

మహబూబాబాద్ రూరల్: బీఆర్‌ఎస్ ఎన్నికల ఏజెంట్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ రామ్మోహరెడ్డి ఎన్నికల నిబంధనలు అతిక్రమించాడని వీడియో సర్వే లైన్స్ టీం బాధ్యులు హరిప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని మహబూబాబాద్ టౌన్ ఎస్సై వి.విజయరాం కుమార్ శనివారం తెలిపారు.

ప్రచార వాహనం సీజ్

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాల్లో అనుమతి లేకుండా తిరుగుతున్న బీఆర్‌ఎస్ ప్రచార వాహనాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ పోలీసులు సీజ్ చేశారు. శనివారం రాత్రి నిబంధనలకు విరుద్ధంగా ప్రచారంలో తిరుగుతున్న వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి తగిన చర్యలు తీసుకోవాలని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కుసుమ సురేష్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపాడు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం



ప్రచారంలో పాల్గొన్న మంత్రి సత్యవతి, శంకర్‌నాయక్


ప్రచారంలో భాగంగా టీ తయారు చేస్తున్న శంకర్‌నాయక్

● మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని రాష్ట్ర గిరిజన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో శనివారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో మంత్రి మాట్లాడుతూ.. ఆసరా పింఛన్లు, రైతుబంధు లాంటి పథకాలు తెలంగాణలో తప్ప దేశంలో మరెక్కడ అమలుకావడం లేదన్నారు. 2014కు ముందు ప్రస్తుతం ఉన్న మానుకోటకు తేడా చూసి ఓటు వేయాలన్నారు. వ్యవసాయంపై అవగాహన లేని రేవంత్‌రెడ్డి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని అనడం మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. శంకర్ నాయక్ మాట్లాడుతూ.. మానుకోట మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగి మానుకోట రూపురేఖలు మారాయన్నారు. మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి చూసి తనకు ఓటు వేసి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్, బీఆర్‌ఎస్ నాయకులు మార్నేని వెంకన్న, చిట్యాల జనార్దన్, మురళీధర్ రెడ్డి, గద్దె రవి, గోగుల రాజు, రావిష్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: దేశంలో ఎక్కడలేని విధంగా పార్టీలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బానోతు శంకర్‌నాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ యాకయ్య, ఉపసర్పంచ్ యాకాంతం గౌడ్, సీతామహాలక్ష్మి, ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

నెల్లికుదురు: బీఆర్‌ఎస్‌లోకి మండలంలోని జామతండాకు చెందిన వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుగులోతు యాకూబ్ నాయక్‌తోపాటు 50 మంది శంకర్ నాయక్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో తొర్రూరు ఏఎంసీ వైస్ చైర్మన్ విజయ్ యాదవ్, సర్పంచ్ మౌనిక శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బీముడు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి


గార్ల: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

గార్ల: ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఈనెల 30న స్వేచ్ఛగా ఓటు వేయాలని ఎంపీడీఓ జి.రవీందర్ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం గార్లలో పాఠశాల విద్యార్థులచే నెహ్రూసెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై బానోత్ వెంకన్న, డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, ఎంపీఓ రజిని, పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి, ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేసముద్రం: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలంటూ శనివారం సాయంత్రం మండల కేంద్రంలో ఎంపీడీఓ రవీందర్‌రావు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం రాజీర్, అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మరిపెడ: విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలని నిర్వచనం-నిర్ధారణ సంస్థ ప్రతినిధి నిహాల్ కృష్ణ సూచించారు. మున్సిపాలిటీ కేంద్రంలోని ఆర్‌జేఆర్‌ఎం డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు రితేష్‌రెడ్డి, హర్షిత్, జోయేల్, తరుణ్, అక్షిత్, విక్టర్ పాల్గొన్నారు.

'ఆల్ ది బెస్ట్ భారత్'


మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

నెహ్రూసెంటర్: క్రికెట్ వరల్డ్ కప్‌లో భాగంగా నేడు జరగనున్న భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌లో భారత్ విజయం సాధించాలని జిల్లా క్రికెట్ ఆసోసియేషన్ అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి ఆకాంక్షించారు. వరల్డ్ కప్‌లో విజయం సాధించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో 'ఆల్‌ది బెస్ట్ భారత్' అంటూ జాతీయ జెండాలతో శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కోచ్ మెతుకు కుమార్, పిట్టల శ్రావణ్, భూక్య ప్రవీణ్, నూనావత్ బాలు, ధర్మచరణ్‌రెడ్డి, చిన్మయి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలి


మాట్లాడుతున్న సునంద

మహబూబాబాద్ రూరల్: చిన్నపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మీద అవగాహన కల్పించాలని, అవసరమైన ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలని షీ టీం ఎస్సై సునంద అన్నారు. అడిషనల్ ఎస్పీ చెన్నయ్య ఆధ్వర్యంలో మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామంలో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలు ఆపద సమయంలో డయల్ 100, షీటీం నంబరును సంప్రదించాలన్నారు. సైబర్ నేరాలు, పోక్సో చట్టాలు, బాల్యవివాహాల అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమస్యలు వస్తే షీ టీం వాట్సప్ నంబర్లు 87126 56935, 79011 42009 తెలపాలన్నారు. ఈ సదస్సులో హెచ్‌ఎం వెంకటరెడ్డి, షీటీం ఏఎస్సై ఆనందం, ఉమెన్ పీసీలు అరుణ, పార్వతి, పీసీ రమేష్, ఊర్మిళ పాల్గొన్నారు.

పంటలను కాపాడాలని వినతి


ఆర్ఐకి వినతిపత్రం ఇస్తున్న రైతులు

బయ్యారం: నీటి తడిలేక ఎండిపోతున్న వరిపంటను కాపాడాలని కోరుతూ మండలంలోని వెంకట్రాంపురం పంచాయతీకి చెందిన పలువురు రైతులు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ నారాయణకు వినతిపత్రంను అందజేశారు. బయ్యారం పెద్ద చెరువులో తగినంత నీరు లేకపోవటంతో ఇటీవల ఇరిగేషన్ అధికారులు వంతులు కేటాయించారన్నారు. తమ వంతులో రావాల్సిన నీటిని రానియ్యకుండా కాల్వ పై భాగంలోని రైతులు బుర్రలు తీస్తున్నారని దీని వలన తమకు నీరు రాక పంటలు ఎండిపోతున్నాయని రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైనా తమకు నీరు వచ్చేలా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో లింగయ్య, శివాజీ, మోహన్‌రావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించండి

● ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళీనాయక్


కేసముద్రం: అమీనాపురంలో ప్రచారంలో మాట్లాడుతున్న మురళీనాయక్


మురళీనాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు


మురళీనాయక్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

కేసముద్రం: ప్రజాసంక్షేమం కోసం పాటుపడే కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మహబూబాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళీనాయక్ అన్నారు. శనివారం మండలంలోని అమీనాపురం, కల్వల, నారాయణపురం, పెద్దమోరితండాజీపీ, గాంధీపురంజీపీ, తాళ్లపూసపల్లి, అన్నారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా శ్రీభూనీలాసమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగించిన బీఆర్‌ఎస్‌కు ప్రజలు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని, అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ప్రజలు గమనించి చేతి గుర్తుకు ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక

అమీనాపురం గ్రామంలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఉపసర్పంచ్ ఆరిద్రపు శ్రీనివాస్, షేకిడి సతీష్, సామ శ్రీనివాస్‌రెడ్డి, షేకిడి పిచ్చయ్య, పోకల సతీష్ మురళీనాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నాగలిని మురళీనాయక్‌కు అందించారు. అదే విధంగా ఉప్పరపల్లి, సప్పిడిగుట్ట తండాకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు అంబటి లక్ష్మీ, గంట అశోక్‌రెడ్డి, బాలునాయక్, ధన్నసరి సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, కదిర సురేందర్, పోలెపాక నాగరాజు, కేసముద్రంస్టేషన్ సర్పంచ్ బట్టు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించండి

మహబూబాబాద్ రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఆశీర్వదించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ భూక్య ఉమా అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భూక్య మురళీనాయక్ గెలుపు కోరుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో శనివారం ఉమా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు రెండుసార్లు అవకాశం ఇస్తే అభివృద్ధిని మరచి అవినీతికి తెరతీశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఆరు గ్యారంటీ పథకాలతో అన్నివర్గాల ప్రజలకు లబ్ధి జరుగుతుందన్నారు. ప్రజలు ఒకసారి ఆలోచన చేసి హస్తం గుర్తుకు ఓట్లు వేసి మురళీనాయక్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు చిదిరాల జ్ఞానేశ్వర్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాళ్ల నర్సింహరావు, నాయకులు గిరిధర్ గుప్తా, సోమ శ్రీను, మురళీ, వేముల సురేష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యాన్ని సాధిద్దాం

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతో ఇందిరమ్మ రాజ్యాన్ని సాధిద్దామని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు గండు కార్తీక్ గౌడ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని జమండ్లపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ గెలవగానే ముందుగా ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక అవకాశం కల్పించి డాక్టర్ మురళీనాయక్‌ను మానుకోట నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలోనాయకులు నిమ్మ నర్సయ్య, లింగస్వామి నరసింహారెడ్డి, గడిపల్లి రవి, పాపాచారి, బుర్ర శ్రీను, శంకు, శరత్, అశోక్, మహేష్ పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి


వెంకటాపురం(ఎం): మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి


కొండాయి జంపన్నవాగులో నడుచుకుంటు వెళ్తున్న బడే నాగజ్యోతి

● ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

వెంకటాపురం(ఎం): ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నాగజ్యోతి గెలుపు కోసం కృషి చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ ములుగు ఎన్నికల ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇంచెర్ల ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వెంకటాపురం మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి మండలాధ్యక్షుడు లింగాల రమణారెడ్డి అధ్యక్షత వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మేనిఫెస్టోను ప్రతి గడపగడపకు తీసుకవెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మూడు మండలాల ఇన్‌చార్జ్ సాంబారి సమ్మారావు, నాయకులు అశోక్, బుర్ర సమ్మయ్య, పోరిక హర్షినాయక్, చంటి భద్రయ్య, కూరెళ్ల రామాచారి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే నాగజ్యోతిని గెలిపిస్తాయి

ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతిని గెలిపిస్తాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సూర్యనేని మురళీధర్‌రావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని లక్ష్మీదేవిపేటలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగజ్యోతి గెలుపుకోసం కార్యకర్తలు ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహించాలన్నారు.

ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకుంటా..

ఏటూరునాగారం: ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకుంటామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బడే నాగజ్యోతి కొండాయి, మల్యాల, చిన్నబోయినపల్లి, దొడ్ల, పెద్ద వెంకటాపురం గ్రామాల్లో పర్యటించారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కొండాయి, మల్యాల గ్రామానికి జంపన్నవాగులో రెండు కిలోమీటర్లు వెళ్లి ప్రచారాన్ని చేపట్టారు. వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, సర్పంచ్ కాక వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ కోట నర్సింహులు, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సర్దార్‌పాషా, నాయకులు ప్రదీప్‌రావు, మల్లారెడ్డి ఉన్నారు.

అభివృద్ధికి అడ్డుగా మారిన ఎమ్మెల్యే

నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే ధనసరి అనసూయ అడ్డుగా మారిందని జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. శనివారం రాత్రి ఏటూరునాగారం మండల కేంద్రంలో రోడ్డు షోలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే సీతక్క కల్లబొల్లిమాటలు చెబుతుందని, రకరకాల మాటలు చెబుతూ సింపతి తెచ్చుకుంటుందన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎన్నికల నిబంధనలు పాటించాలి

నర్సింహులపేట: ఈనెల 30వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలని తొర్రూరు సీఐ సత్యనారాయణ అన్నారు. శనివారం ఎస్సై గండ్రాతి సతీష్ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దనాగారం, బొజ్జన్నపేట, ముంగిమడుగు, కౌసల్యదేవిపల్లి, గోపాతండా గ్రామాల్లో నిర్వహించిన పోలీసు కవాతు నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీకే మద్దతు

గార్ల: కాంగ్రెస్ పార్టీకే మద్దతు ఇస్తున్నామని గార్ల మాజీ ఎంపీపీలు లాలునాయక్, అర్జున తెలిపారు. శనివారం వారు మాట్లాడారు. తారాబాయి, హరినాయక్, రామ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించండి

కేసముద్రం: వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ఓట్లేసి గెలిపించాలని మహబూబాబాద్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జాటోత్ హుస్సేన్‌నాయక్ కోరారు. శనివారం మండలంలోని పెనుగొండ, నర్సింహులగుడెం, మర్రితండాజీపీ, బోడమంచ్యాతండా జీపీ, ఇంటికన్నె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేద్దాం

కురవి: రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించి సీఎం కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేద్దామని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. శనివారం కురవి మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి), పెద్దతండాల్లో రెడ్యానాయక్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

కురవి: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని కర్నాటక బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌తంగడగి అన్నారు. శనివారం మండలంలోని కంచర్లగూడెం తండాలో ఎమ్మెల్యే అభ్యర్థి రాంచంద్రునాయక్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

మహబూబాబాద్ రూరల్: రాష్ట్రంలో అన్నివర్గాలకు అన్యాయం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బొందపెట్టాలని టీఎస్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అజ్మీర సురేష్ నాయక్ పిలుపునిచ్చారు. తెలంగాణ విద్యార్థి జేఏసీ, ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను జిల్లా కేంద్రంలోని డాక్టర్ భూక్య మురళీనాయక్ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు.

బయటపడ్డ వర్గవిభేదాలు

దంతాలపల్లి: మండలం బొడ్లాడ గ్రామంలో మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే అభ్యర్థి శంకర్‌నాయక్ భార్య సీతామహాలక్ష్మి ముందు శనివారం బీఆర్‌ఎస్ పార్టీలో వర్గ విభేదాలు బయటపడ్డాయి. మంత్రి గ్రామంలోకి రాగానే గ్రామశాఖ అధ్యక్షుడి వర్గం సమావేశం సర్పంచ్ ఇంట్లో నిర్వహించినట్లైతే మేము అక్కడికి రామని చెప్పారు. దీంతో మంత్రి పార్టీ అధ్యక్షుడి ఇంట్లోనే సమావేశం నిర్వహించారు.

చెక్‌పోస్టుల వద్ద నగదు సీజ్

డోర్నకల్: డోర్నకల్, ముల్కలపల్లి చెక్‌పోస్టుల వద్ద శనివారం నగదును స్వాధీనం చేశారు. డోర్నకల్ చెక్‌పోస్టు వద్ద పెనుబల్లికి చెందిన అశోక్‌రెడ్డి తిరువూరు నుంచి గార్లకు ఆటోలో వెళ్తుండగా సిబ్బంది తనిఖీ చేయగా రూ.66,800 నగదు ఉండటం, ఎలాంటి రశీదులు లేకపోవడంతో సీజ్ చేశారు. ముల్కలపల్లి చెక్‌పోస్టు వద్ద ఖమ్మం నుంచి మహబూబాబాద్‌కు టాటా ఏస్ వాహనంలో వెళ్తున్న ఖమ్మంకు చెందిన నాగేశ్వర్‌రావు వద్ద రూ.51,000 లభించడంతో సీజ్ చేశారు.


కురవి: ఓటర్లకు డబ్బులు పంచుతుంటే ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఒక వ్యక్తిని పట్టుకుని అతని వద్ద ఉన్న నగదును సీజ్ చేసినట్లు సీరోలు ఎస్సై ఎం.రమాదేవి తెలిపారు. శనివారం ఎస్సై రమాదేవి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కురవి మండలం మోద్గులగూడెం గ్రామంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గాడిపల్లి రాములు సభకు వచ్చిన ఓటర్లకు నగదును పంచుతున్న సమయంలో అధికారులు పట్టుకున్నట్లు వివరించారు. గాడిపల్లి రాములు వద్ద నుంచి రూ.14,500 పట్టుకున్నట్లు తెలిపారు. వీఎస్‌టీ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, ఇరిగేషన్ ఏఈఈ దాలంశెట్టి నాగేంద్రబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాదేవి తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

మహబూబాబాద్ రూరల్: ఎక్సైజ్ శాఖ రాష్ట్ర డిప్యూటీ మాజీ కమిషనర్ బానోత్ మోహన్ లాల్ టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

గార్ల: గార్లలోని హనుమంతుని గుడి బజారుకు చెందిన 70 ముదిరాజ్ కుటుంబాలు శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామారావు, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, గుండా వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో వీరేష్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు ఉన్నారు.

హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయం



గార్ల: రాష్ట్రంలో మరోసారి హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ కావడం ఖాయమని కామేపల్లి జెడ్పీటీసీ బి.ప్రవీణ్‌నాయక్ అన్నారు. శనివారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వరని, డబ్బులకు మాత్రమే టికెట్లు అమ్ముకుంటారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బీఆర్‌ఎస్ పార్టీలో చేరానన్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు రామచంద్రునాయక్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ హరిప్రియ గెలుపు కోసం అహర్నిషలు కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, మార్కెట్ చైర్మన్ హరిసింగ్ నాయక్, ఎంపీపీ శివాజీచౌహాన్, ప్రధాన కార్యదర్శి ఉమేష్, ఎంపీటీసీ రమేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువతి మృతి

మామునూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువతి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మధ్యాహ్నం మృతి చెందింది. ఎస్సై కృష్ణవేణి కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం తారసింగ్ తండాకు చెందిన గుగులోతు సోనియా (19) వరంగల్ నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఒకేషనల్ కోర్సు చేస్తోంది. అశోక్ అనే వ్యక్తి బైక్‌పై తన సొంత గ్రామానికి ఆమె శుక్రవారం రాత్రి వరంగల్ నుంచి బయల్దేరింది. వరంగల్ - ఖమ్మం రహదారిపై మామునూరు శివారు చెరువు కట్ట వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చే ఆటోను తప్పించబోతూ బైక్‌పై నుంచి సోనియా, అశోక్ కిందపడిపోయారు. రోడ్డుపై వారిని ఓ కారు ఢీకొట్టడంతో ఇద్దరు గాయాలయ్యాయి. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించి ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన సోనియా చికిత్స పొందుతూ శనివారం కన్నుమూశారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణవేణి తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

డోర్నకల్: మండలంలోని జోగ్యాతండాకు చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై ఝాన్సీ తెలిపిన వివరాల ప్రకారం.. జోగ్యాతండాకు చెందిన చాందావత్ పత్యా(35) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఈనెల 16న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మృతికి సంతాపం

డోర్నకల్: స్థానిక బాపూజీనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ ఏపూరి వెంకటేశ్వర్లు(57) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం ఎంపీ కవిత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ తదితరులు సంతాపం తెలిపారు.

ముగ్గుల పోటీలు

డోర్నకల్: స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్‌లో శనివారం డోర్నకల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మహిళలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలకు మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ బహుమతులను ప్రదానం చేశారు.